(శ్రీ)నాథరావు గారి
పుస్తకానికి ముందుమా

# ముందుమాట

సమస్యలను వెలికి తీయడం కోసమే కాక వాటి పరిష్కారం కోసం కూడా పని చేసే వారికి కొంత కాలానికి విపరీతమైన విసుగువస్తుంది. ఏ ప్రయత్నమూ ముందుకు నడవదు, ఏ పరిష్కారమూ సాఫీగా సాగదు.కాయితం మీద చదువుకున్నప్పుడు స్పష్టంగా కనిపించే చట్టాలు అమలు దాకా వచ్చే పనికి అయోమయంగా, అస్పష్టంగా కనిపిస్తాయి. చూస్తుండగానే వాటిలో కొన్ని వాక్యాలు అర్థాన్ని మార్చేసుకుంటాయి. లేని పదాలు వచ్చి కూర్చుంటాయి. ఉన్నవి మాయమవుతాయి. చట్టాలు చేసేవారి లక్ష్యమేమిటోగానీ వాటి నుండి హక్కులు పొందాలని చూచేవారికి అవి ఒకరకంగా కనిపిస్తాయి. వాటిని అమలు చేయవలసిన ప్రభుత్వ అధికారులకు అవి ఇంకొక రకంగా కనిపిస్తాయి. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల విహంగవీక్షణానికి అంబానీ సోదరుల ఆస్తి తగాదా, మారేడుమిల్లిలో గిరిజన-గిరిజనేతరుల ఆస్తి తగాదా ఒకే తీరుగా కనిపిస్తాయి. రెంటికీ వర్తించే సూత్రం ఒకటే.

అందుకే ఆదివాసులకు ఇతర పేదలకు, హక్కులు రక్షణ కల్పించే చట్టాలుండి ఏం ప్రయోజనం అని చాలాసార్లు అనిపిస్తుంది. కొంచెం ఆగి, ఆ చట్టాలే లేనట్టయితే పరిస్థితి ఎట్లాగుండేది అని ఆలోచిస్తే తప్ప ఆలోచనకు సమతుల్యం ఒనగూడదు. బహుశా ఏ కాకతీయుల కాలంలోనో, గోల్కొండ నవాబుల కాలంలోనో మాకు మీ చట్టాలు వద్దు, అవి ఇచ్చే హక్కులు వద్దు, అసలు మీ పాలనే వద్దు అని తిరస్కరించే అవకాశం ప్రజలకు ఉండిందేమోగానీ ఇవ్వాళ లేదు. రాజ్యం మనల్ని అడిగి మన నెత్తిన వచ్చి కూర్చోదు. అది మన నెత్తిన కూర్చొని ఉంది. దానిని కాదని ఏ గుహ లోకి పోలేము. ఏ కొండ కోనలలోకి పోలేము. ప్రత్యేకించి, సంపన్నమైన అడవులలో నివసించే ఆదివాసులు రాజ్యాన్ని ఎట్టి పరిస్థితిలోనూ తప్పించుకోలేరు. కలప, వేగంగా పారే ఏర్లు, విలువయిన మొక్కలు, నేల క్రింది

ఖనిజసంపద, వీటిలో దేనినీ పాలకులు వదులుకోరు. ఈరోజు ఏ సీతారామరాజు, కొమురంభీము రాజ్యాన్ని అడవులలోకి రాకుండా ఆపలేడు - మావోయిస్టులతో సహా ఎవరికీ ఇది తాత్కాలికంగా తప్ప సాధ్యం కాదు.

అందుకే అదే రాజ్యం చేత చట్టాలు చేయించుకోవాలి. వాటిని అమలుచేయించుకోవాలి. అది నియంతృత్వ రాజ్యం కాక ప్రజాస్వామ్య రాజ్యం కావడం మంచిదయింది. అది వట్టి రాజకీయ ప్రజాస్వామ్యమే కాక, సామాజిక సంక్షేమం, సమన్వయం మొదలయిన విలువలు ప్రకటించుకున్న రాజ్యం కావడం మరీ మంచిదయింది. ఏలినవారు తమంతటతాము రాజ్యానికి ప్రజాస్వామిక స్వభావం ఇవ్వాలని కోరుకోలేదు. తమంతట తాము దానిని సంక్షేమరాజ్యంగా రూపొందించాలని అసలే కోరుకోలేదు. పారిశ్రామిక, సాంకేతిక ప్రగతి కారణంగా రాజ్యం మానవ జీవితంలోని అన్ని పార్శ్వాలనూ తన అధికారం పరిధిలోకి తెచ్చుకుంటున్న దశలో, ఈ మార్పు తప్పదని గ్రహించిన వారు, పారిశ్రామిక, సాంకేతిక ప్రగతి వల్ల రాగల ప్రయోజనాలు అందరికీ దక్కాలంటే సార్వజనీనమయిపోయిన రాజ్యం ప్రజాస్వామ్య రూపం చేసుకోవాలని కోరారు. అది ఒనగూడిన క్రమంలో, అది కూడా చాలదనీ, ఆ ప్రగతి ఫలాలు అందరికీ దక్కేటట్లు చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేసే రోజులు వచ్చాయి. అవి తరచుగా పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనల రూపంలో వచ్చాయి. ఈ రకంగా పెట్టుబడిదారీ పారిశ్రామిక సమాజంలో అట్టడుగున ఉన్న ప్రజలు, తమకు అది తెచ్చే ప్రగతిలో వాటా కోరుకున్నారు.

అది బలవంతంగా ఇచ్చిన హక్కు కాబట్టి ఎప్పుడూ సక్రమంగా అమలు కాదు. దానిని అమలు చేసి, ప్రజలకు అందియ్యవలసిన అధికారం యంత్రాంగంలోని అలసత్వం, అవినీతి, ఆ హక్కులు ఇవ్వడం వల్ల ఆస్తులూ, అధికారం కోల్పోయేవారి కపటపు ఎత్తుగడలు వాటిని అమలు కానియ్యవు. కనీసం న్యాయస్థానాల వైఖరయిన మెరుగుగా ఉంటే కొంతలో కొంత ప్రయోజనం దొరికేది. అదివాసీ ప్రజలకు హక్కులు కల్పించే చట్టాలను స్థూలంగా వ్యాఖ్యానించేటప్పుడు న్యాయస్థానాలు ఉదారంగా వ్యవహరించిన సందర్భాలు, విశాల దృక్పథంతో తీర్పులిచ్చిన సందర్భాలు ఉన్నాయిగానీ అది అప్పుడప్పుడు జరిగేది మాత్రమే. రోజువారీగా న్యాయస్థానాలు విచారించే కేసులలో సంక్షేమ చట్టాలను, సమన్యాయాన్ని అందించే లక్ష్యంతో చేసిన చట్టాలను వ్యాఖ్యానించేటప్పుడు తమకు రివాజుగా అలవాటయిన వైఖరిని విడనాడి దూరదృష్టితో పరిశీలించే జడ్జీలు అరుదు. జడ్జి పదవికి రాజ్యాంగం

చాలా అర్హతలే పెట్టింది గానీ, కూపస్థమండూకాలు అనర్హులని చెప్పలేదు. ఎక్కువ మంది జడ్జిలు బావిలో కప్పలే. దీని ఫలితం ఏమిటంటే ఏజెన్సీలో భూమిపైన ఆవగింజంత హక్కులేని గిరిజనేతరులు కేవలం కోర్టు స్టే ఆర్డర్లతో ఏళ్ల తరబడి భూములు అనుభవిస్తున్నారు.

అలసత్వం అవినీతి, దృష్టిలోపం వంటి అవలక్షణాలే కాక ఉద్దేశ్యపూర్వకమైన కౌటిల్యం కూడా ఆదివాసుల హక్కులకు పెద్ద ఆటంకం అయింది. గడచిన ఒకటిన్నర దశాబ్దం కాలంగా ప్రకృతి వనరుల పట్ల నయా ఉదారవాద విధానాలకుండే వైఖరికీ ఆదివాసులకు హక్కులు కల్పించిన చట్టాల వెనుక ఉండే సమన్వయ సూత్రానికీ మధ్య ఒక నిశ్శబ్ద పోరు నడుస్తున్నది. వనరులు ఎక్కడున్నా అమాంతం కబళించాలన్నది నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం వైఖరి. ఇది ఒక వైపు వేగంగా దేశపాలన విధానంగా మారుతున్నది. మరొకవైపు ఎప్పటినుండో ఆదివాసులు తమ కోసం కొట్లాడి సాధించుకున్న హక్కులు ఈ దశలోనే చట్టం రూపం తీసుకున్నాయి. 1996లో పెసా చట్టం వచ్చింది. అది ఏజెన్సీ ప్రాంతాలలో స్వయంపాలన హక్కు కల్పించిన రాజ్యాంగ ఆదేశం. 2007లో ఎప్పటినుండో ఎదురుచూస్తున్న అటవీ హక్కుల చట్టం వచ్చింది. కేవలం పోడు భూములకు పట్టాలివ్వడమే కాక అడవులలో అనేక వ్యక్తిగత, సామూహిక వాడకపు హక్కులను ఈ చట్టం ఇస్తుంది.

పెసానూ అటవీ హక్కుల చట్టాన్నీ మనస్ఫూర్తిగా గౌరవించేటట్టయితే అటవీ సంపదను పెట్టుబడిదారీ కంపెనీలకు విస్తరి వేసి వడ్డించడం సాధ్యం కాదు. కాబట్టి వాటితో నిమిత్తం లేకుండ 'అభివృద్ధి' చేపడుతున్నారు. పెసా చట్టంలోని నియమాలను గౌరవించకుండా పోలవరం భూసేకరణ చేసేస్తున్నారు. 'స్వయంపాలన' గల అదివాసీ గ్రామాలు తమ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా తమ ఆవాసమైన అడవికి పరాయి అవుతున్నారు. వారికి అక్కడే పునరావాసం కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకోవడానికి ఇతర ఆదివాసుల అనుభవంలో ఉన్న భూమినే తీసుకొని కాలనీలు కట్టిస్తున్నారు. పెసా చట్టన్ని అనుసరించి గ్రామ సభను, మండల పరిషత్‌ను, నిజమైన అర్థంలో సంప్రదించినట్టయితే గిరిజనేతరుల భూమిని, అవసరమయితే డబ్బులిచ్చి తీసుకొమ్మంటారు కాబట్టి అటువంటి సంప్రదింపు పెట్టుకోవడం లేదు.

అటవీ హక్కుల చట్టం వచ్చిన తరువాత అడవులలో గనులకు లీసు లివ్వడం కష్టం. ఎందుకంటే అడవులలో ఆదివాసులు అనుభవిస్తున్న ప్రతీ హక్కుకూ

ఇప్పుడు గుర్తింపు వచ్చింది. గుర్తించిన ఆ హక్కును పారిశ్రామిక అవసరాల కోసం తొలగించి ఆ భూమిని ఏ కంపెనీకో కట్టబెట్టే అధికారం ఆ చట్టం ప్రభుత్వానికి ఇవ్వలేదు. ఈ విషయాన్ని గుర్తించి కాబోలు గుట్టుచప్పుడు కాకుండా అడవులలో ఆదివాసులు అనుభవిస్తున్న భూముల నుండి వారిని తొలగించి కంపెనీ సెక్యూరిటీని కాపలా పెట్టి చకచకా పనికానిచ్చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల కోసం టేకుల పల్లి, గుండాల, కొత్తగూడెం మండలాలలో ఆదివాసులు పోడు కొట్టుకున్న వందలాది ఎకరాల భూమి నుండి వారిని తొలగించి హక్కులొచ్చాయన్న విషయం వారికి చెప్పకుండా, పోడుకొట్టుకునే హక్కు మీకు లేదు కదా, అయినా ప్రభుత్వం దయకొద్దీ ఎకరానికి 5 వేలు ఇస్తున్నది చూడండి. ఎంత దయగలదో అని చెప్పి ఆ పైకం చేతిలో పెట్టి పంపించేస్తున్నారు.

ఇటువంటి కౌటిల్యం ఆదివాసీ హక్కుల విషయంలో ప్రభుత్వం అనేక రూపాలలో, అనేక సందర్భాలలో ప్రదర్శించింది, ప్రదర్శిస్తున్నది. ఆదివాసుల హక్కులు, వారి బాగు తన ఏకైక కార్యక్షేత్రంగా పెట్టుకొని ఎంతో కాలంగా పనిచేస్తున్న మిత్రుడు పల్లా త్రినాథరావు ఈ కౌటిల్యాన్ని దగ్గరి నుండి చూసాడు. దాన్ని ఎదుర్కోవడానికి ఆదివాసులకు ఒక పక్క సహకరిస్తూ మరొక పక్క దాని గురించి బయటి ప్రపంచానికి తెలియజేయడానికి వివిధ పత్రికలలో రాస్తున్నాడు. ప్రభుత్వ అభివృద్ధి విధానాలు, వాటికి ప్రధాన ప్రేరణగా ఉన్న కార్పొరేట్ కంపెనీల అవసరాలు, అవి వేసే అందమైన వేషాలు, చట్టాలను నీరుగార్చిన అధికారులు, గిరిజనేతరుల ఎత్తుగడలు, వాటిని నివారించడానికి అవసరమైన చట్టసవరణలు, అటవీ సంరక్షణ పేరిట ఆదివాసుల అటవీ హక్కులను తొలగించే ప్రయత్నాలు, దానికి నివారణోపాయాలు, మొదలైన అనేక విషయాల గురించి కూడా ఆయన వ్యాసాలు రాసాడు. అవన్నీ ఇప్పుడు సంకలనంగా మనముందున్నాయి. నిండయిన నిబద్ధతకు, అనుభవము, విషయపరిజ్ఞానం తోడయితే వచ్చే అవగాహన ఈ వ్యాసాల నుండి మనం పొందగలుగుతాం.అది మన ఆలోచనల సమగ్రతకు ఎంత అవసరమో, ఆదివాసులకు మనం చేయగల సహాయానికీ ఇవ్వగల సహకారానికీ కూడా అంత అవసరం.

– కె.బాలగోపాల్

హైదరాబాద్.